ప్రజాశక్తి

గురువారం 5 సెప్టెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నగరంలో వైరల్ జ్వరాలు

☛ వాతావరణ మార్పులతో పెరుగుతున్న కేసులు



ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. గడిచిన కొద్దిరోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఫ్లూ వైరస్ యాక్టివ్ కావడంతో జ్వర పీడితులు పెరుగుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఫ్లూ వైరస్ బారినపడిన వారిలో జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, గొంతు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. అతికొద్ది మందిలో మాత్రం ఆయాసం ఉంటోంది. ఈ తరహా లక్షణాలు మూడు నుంచి వారం రోజులపాటు కనిపిస్తున్నాయి. వైద్యుల సలహా మేరకు మందులు వాడితే వారం రోజుల్లో తగ్గుతున్నాయి. సాధారణంగా సీజన్ మారే సమయంలో ఫ్లూ వైరస్లు యాక్టివ్ అవుతుంటాయి. రానున్న రోజుల్లో ఫ్లూ వైరస్ మరింత ఇబ్బందిపెట్టే అవకాశముందని, అందువల్ల వృద్ధులు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో బయటకు వెళ్లకుండా, ఒకవేళ వెళ్లాల్సి వచ్చినా, చల్లని గాలులు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు.

జ్వర లక్షణాలతో కెజిహెచ్‌తో పాటు, విమ్స్‌లో జనరల్ మెడిసిన్ విభాగానికి ప్రతిరోజు 300కు పైగా జ్వర పీడితులు వస్తున్నారు. ప్రైవేట్ క్లినిక్కులకు ఇటువంటి రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. ముఖ్యంగా చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వైద్యులు పరీక్షలు చేసి, ఆందోళనకరంగా ఉన్నవారినే ఇన్ పేషెంట్లుగా చేర్చాలని సూచిస్తున్నారు. జ్వరం మూడు నుంచి ఐదు రోజులు ఉంటుంది. ఇతర లక్షణాలు మరో రెండు రోజులు ఉంటున్నాయని వైద్యులు అంటున్నారు.

తగ్గిన మలేరియా, డెంగీ కేసులు

వాస్తవానికి గతేడాదితో పోల్చి చూస్తే ఈ ఏడాది జులై నెలాఖరు నాటికి మలేరియా, డెంగీ కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టాయని జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత సీజన్లో మార్పులు రావడంతో సీజనల్ వ్యాధులు, వైరల్ పీవర్స్ అధికంగా ఉన్నాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా వేధిస్తున్నాయి. జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉంటున్నాయి. ప్లేట్ లెట్స్ తగ్గి, నీరసం ఎక్కువుగా ఉన్న రోగులు వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం స్టాప్ డయేరియా పేరుతో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య సర్వే చేపడుతున్నారు. ఆ సమయంలోనే ఏ ఇంటిలో ఎవరికి అనారోగ్య పరిస్థితులు ఉన్నా వారికి సకాలంలో వైద్యసేవలందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల్లో డయోరియా, ఇతర డీహైడ్రేషన్, నివారణకై ఒఆర్ఎస్ కార్నర్లు ఏర్పాటు చేసి సకాలంలో ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు సిద్ధం

మిగతా 2లో..

కేరళ వామపక్ష ప్రభుత్వం-ప్రత్యామ్నాయ పాలనపై...

అల్లూరిలో నేడు సదస్సు

ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఆ రాష్ట్ర పూర్వ మంత్రి శైలజా టీచర్



శైలజాటీచర్‌కు స్వాగతం పలుకుతున్న జగ్గునాయుడు తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేరళ వామపక్ష ప్రభుత్వం, ప్రత్యామ్నాయ పాలన అంశంపై గురువారం సాయంత్రం 4 గంటలకు డాబాగార్డెన్స్ లోని అల్లూరి సీతారామ రాజు విజ్ఞాన కేంద్రంలో జిల్లాస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా కేరళ పూర్వ మంత్రి డాక్టర్ కె.శైలజా టీచర్ పాల్గొంటారని, ఈ సదస్సును విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శైలజా టీచర్‌కు ఘన స్వాగతం

విశాఖ జిల్లాలో బుధ, గురువారాలలో జరగనున్న వివిధ కార్యక్రమాలలో పాల్గొనడానికి విచ్చేసిన కేరళ పూర్వ వైద్య శాఖా మంత్రి డాక్టర్ కె.శైలజ టీచర్‌కు విశాఖపట్నం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. కేరళ వైద్య శాఖ మంత్రిగా కరోనా విజృంభనను నిలువరించి వేలాదిమందిని కాపాడటంలో డాక్టర్ కె.శైలజ చేసిన విశేష కృషికి జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఎయిర్ పోర్టులో ఆమెకు స్వాగతం పలికిన వారిలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శి వర్గ

మిగతా 2లో..

భీమిలి తీరంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

▶ వార్త మెయిన్ 2లో..

పాత పెన్షన్ విధానం అమలుకు ఉద్యమం

▶ వార్త 8లో..

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

▶ వార్త 4లో..

ఆస్తిపన్ను తగ్గింపు, రద్దు అంశాలను అజెండాలో చేర్చాలి: సిపిఎం

▶ వార్త 8లో..

మొదటి పేజీ తరువాయి..

నగరంలో వైరల్ జ్వరాలు

చేశారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు రావడం, అడపాదడపా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యపరిస్థితిలో మార్పులు రావడం సహజమని, ఈ సమయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు, డ్రై డే పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రతి ఇంటిలోనూ కాచి చల్లార్చిన నీటిని తాగడం, వేడి ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

రద్దీగా ప్రైవేట్ క్లినిక్‌లు

నగరంలో వైరల్ జ్వరాలు అధికమవుతున్న నేపథ్యంలో ప్రతి చిన్న ప్రాంతాల్లో ఉన్న క్లినిక్‌లు కూడా రద్దీగా కనిపిస్తున్నాయి. పలు వార్డులో రూ.50కే ఒపి చూసే వైద్యులు ఉండటంతో వారి వద్ద రోగుల రద్దీ కనిపిస్తోంది. కెజిహెచ్ సమీపంలో ఉన్న ఆసుపత్రులు కూడా రద్దీగానే ఉన్నాయి. రోగుల అవసరాల మేరకు పలు ప్రైవేట్ ఆసుపత్రులు వైద్యపరీక్షల పేరిట దోపీడీ చేస్తున్నాయి. పలు ఆసుపత్రులు అనుమతులు లేకుండా ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు నడుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం : డిఎం అండ్ హెచ్‌ఒ

వైరల్ జ్వరాలపట్ల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. నగరంలో వైరల్ జ్వరాలు అధికంగా వస్తున్న మాట వాస్తవం అన్నారు. మలేరియా, డెంగీ జ్వరాలు అంతగా లేవని తెలిపారు. ఈ పరిస్థితులలో ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి పిహెచ్ సి, యు పిహెచ్ సిల్లో వైద్యులు, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు. ఎప్పటికప్పుడు మురికివాడ ప్రాంతాలు, ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. స్టాప్ డయేరియాపై ప్రజలకు అవగాహణ, నివారణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కేరళ వామపక్ష ప్రభుత్వం-ప్రత్యామ్నాయ పాలనపై అల్లూరిలో నేడు సదస్సు

సభ్యులు బి.పద్మ, బి.జగన్, బొట్టా ఈశ్వరమ్మ, జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, బి.రమణి, బి.వెంకటరావు, సిఐటియు జిల్లా నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, ఐద్వా జిల్లా నాయకులు ఎస్.విజయలక్ష్మి, కె.అనురాధ, కె.ప్రభావతి, బి.అనంతలక్ష్మి, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు బి.లీలావతి, విద్యార్థి సంఘం జిల్లా నాయకులు కుసుమ తదితరులు ఉన్నారు.

ఇపిడిసిఎల్ వద్ద జరిగే ధర్నా వాయిదా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎపి ఈపిడిసిఎల్ వద్ద గురువారం జరగాల్సిన ధర్నా వాయిదా పడిందని ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ తెలిపారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని సిఎమ్‌డి ఆఫీసుల వద్ద గురువారం జరపతలపెట్టిన ధర్నాలను తాత్కాలికంగా వాయిదా వేయడమైనదని పేర్కొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వరదలు, వర్షాలు వలన ఉన్నతాధికారులు విజ్ఞప్తి మేరకు ఈ ధర్నాను ఈనెల 25వ తేదీ నాటికి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ లోపు విద్యుత్ యాజమాన్యం, ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

10, 11 తేదీల్లో దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలు

వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖ, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న కళాప్రపూర్ణ దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలని ఎయు వీసీ ఆచార్య జి.శశి భూషణరావు కోరారు. యూనివర్సిటీలోని టిఎల్ఎన్ సభా హాల్ వేదికగా జరుగనున్న ఈ ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య ఎంవిఆర్ రాజు, తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య జర్ర అప్పారావు, అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు ఉప్పల అప్పల రాజు, డాక్టర్ సిఎన్ క్షేత్రపాల్ రెడ్డి తదితరులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహాకవి దాశరథి శత జయంతి ఉత్సవాలకు యూనివర్సిటీ వేదిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉత్సవాల జయప్రదానికి అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. తెలుగు శాఖ అధ్యక్షులు జర్ర అప్పారావు, అరసం ప్రతినిధులు ఉప్పల అప్పల రాజు, డాక్టర్ సి ఎన్ క్షేత్రపాల్ రెడ్డి మాట్లాడుతూ, తొలిరోజు సమావేశంలో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

పోర్టు చైర్మన్ అంగమత్తుకు ఎమ్మెల్యే వంశీకృష్ణ వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ పోర్టు ఆధ్వర్యాన దక్షిణ నియోజకవర్గానికి చెందిన పలు అభివృద్ధి పనులను త్వరితగతి చేపట్టాలని పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగమత్తును ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు బుధవారం వినతి పత్రం ఎమ్మెల్యే అందజేశారు. ఎస్ఎల్ కాలువను ఆధునీకరించి, ఇరువైపులా మొక్కలు నాటాలని, 34, 35,39 వార్డులలో పోర్టు సహకారంతో సామాజిక భవనాలను నిర్మించాలని, కెజిహెచ్, విక్టోరియా హాస్పిటల్‌లలో నూతన భవనాలను త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని, ఫిషింగ్ హార్బర్‌లో వున్న ఆక్షన్ బిల్డింగ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నియోజకవర్గంలో మహిళలకు ఉపాధి నిమిత్తం కుట్టుమిషన్లు పంపిణీ చేపట్టాలని, హార్బర్‌లో 2 క్రేన్లు,సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, 35వ వార్డు లక్ష్మీనగర్‌లో నిర్మించే ఇళ్లకు సహాయ సహకారాలు అందించాలని, నెహ్రూ బజార్, జనతా బజార్ ఆధునీకరణలో పూర్తి సహకారం అందించాలని కోరారు. దీనిపై పోర్టు చైర్మన్ అంగమత్తు స్పందిస్తూ దక్షిణ నియోజకవర్గం అభివృద్ధికి తమ వంతు భాగస్వామ్యం ఉంటుందని హామీ ఇచ్చారు.



అక్షయపాత్ర ప్రతినిధికి చెక్కు అందజేస్తున్న చారిటీస్ బాక్స్ నిర్వాకులు

వరద బాధితులకు 'ఛారిటీ బాక్స్' సాయం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విజయవాడను వరద బాధితుల కోసం ఛారిటీ బాక్సు సాయం అందించింది. వరద ప్రభావిత ప్రాంతాలలో ఆహారం సరఫరా చేస్తున్న అక్షయ పాత్రకు చారిటీ బాక్స్ ప్రతినిధి యదురాజా దాసకు రూ.11,116 చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా చారిటీ బాక్సు కోశాధికారి పొట్నూరు వెంకట శివ ప్రసాద్ మాట్లాడుతూ, మానవతా దృక్పథంతో వరద బాధితులకు ఆహారం అందించడం తక్షణ కర్తవ్యం అన్నారు. చారిటీ బాక్సు ప్రతినిధి వెంకటరమణ మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా సహాయంచేసే పంథాను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కొంతం శ్రీకాంత్, లక్కోజు నూకరాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ మార్గాలను వివరిస్తున్నాం

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించే మార్గాలను ఎప్పటికప్పుడు కేంద్రానికి వివరిస్తూనే ఉన్నామమని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురంధేశ్వరి తెలిపారు. విశాఖలోని పార్టీ కార్యాలయంలో బిజెపి సంస్థాగత సభ్యత్వ నమోదును బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు బిజెపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విశాఖ రైల్వే జోన్‌కు గత వైసిపి ప్రభుత్వం అసలు భూమి ఇవ్వలేదని, అందువల్లే ఆలస్యమైందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రంలోని బిజెపి సహకారం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ నాయకులు జివిఎల్.నరసింహారావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ పథకం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాబోయే పండుగ సీజన్‌కు ముందు కస్టమర్లకు సులభంగా నిధులను అందజేసే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లో 'జిత్నే సమయ్ కా లోన్ ఉత్నే కా హి బయాజ్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా ఎంవిపి డబల్ రోడ్డులోని శ్రీ రామ్ ఫైనాన్స్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎలిజబెత్ వెంకటరామన్ మాట్లాడుతూ, తమ శాఖల్లో మౌలిక సదుపాయాలను పెంచుతూ గోల్డ్ లోన్ శాఖలుగా మార్చడానికి పెట్టుబడి పెడుతున్నట్లు తెలిపారు.

వరద సహాయక చర్యల్లో జివిఎంసి ఉద్యోగులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు జివిఎంసి అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు మంగళవారం అర్ధరాత్రి విజయవాడకు చేరుకొని బుధవారం వరద ముంపు ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నారని జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్ విజయవాడ నుంచి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. విజయవాడ 64 వార్డులో "నున్న" ప్రాంతం వద్ద కండ్రేగ ప్రదేశాలలో వరదల్లో చిక్కుకున్న ప్రజలకు ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్‌ను పంపిణీచేసినట్లు పేర్కొన్నారు. విజయవాడలోని 20వ వార్డు నుండి 64వ వార్డు వరకు పలుచోట్ల ప్రజలకు అందించే సహాయక చర్యలలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. తనతో పాటు చైల్డ్ వెల్ఫేర్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి కూడా వరద ముంపు ప్రాంతాల్లో ఆహార పొట్లాలు పంపిణీ కార్యక్రమంలో సేవలందిస్తున్నారని కమిషనర్ తెలిపారు.

11న ఎంజి విండ్సర్ విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జెఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా నుంచి ఇంటిలిజెంట్ క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ ఎంజి విండ్సర్ వాహనాన్ని ఈ నెల 11న దేశవ్యాప్తంగా ఆవిష్కరించనున్నట్లు సంస్థ ప్రతినిధి జాన్సన్ తెలిపారు. బీచ్ రోడ్డులోని ఎంజి షోరూంలో ఆయన మాట్లాడుతూ, అత్యంత ఆధునికమైన డిజైన్‌తో ఈ వాహనాన్ని రూపొందించినట్లు చెప్పారు. పొడవైన వీల్‌బేస్ ఉందన్నారు.


త్రిఫ్ట్ సభ్యుల సొమ్మును వడ్డీతో జమ చేయాలి

• త్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గం ధర్నా • అఖిల పక్షాల కార్మికుల సంఘీభావం

ప్రజాశక్తి-ఉక్కునగరం : సభ్యులైన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల నుండి రికవరీ చేసిన సొమ్ము రూ. 60.24 కోట్లు వెంటనే త్రిఫ్ట్ సొసైటీకి జమచేయాలని త్రిఫ్ట సొసైటీ పాలకవర్గం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఫైనాన్స్ అండ్ ఎకౌంట్స్ సెక్షన్ వద్ద త్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సంఘీభావం తెలిపిన సిఐటియు, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎమ్ఎస్, బిఎమ్ఎస్, టిఎన్‌టియుసి, విఎస్ఇయు, విఎస్ఎమ్ఎస్, డిఐటియు తదితర అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ, త్రిఫ్ట్ సొసైటీ సభ్యులైన ఉద్యోగుల జీతాల నుంచి కోతపెట్టిన సొమ్మును స్టీల్ యాజమాన్యం త్రిఫ్ట్ సొసైటీకి చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. యాజమాన్య చర్యలను తీవ్రంగా ఖండించారు.

సొసైటీ డైరెక్టర్ ఎంవి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్య రామ్ మాట్లాడుతూ జిందాల్‌కు ,టాటా కన్సల్టెన్సీ వద్ద తీసుకున్న సొమ్ముకు వడ్డీతో చెల్లిస్తున్న యాజమాన్యం, త్రిఫ్ట్ సొసైటీ సభ్యుల నుండి కొన్ని నెలలుగా రికవరీ చేసిన రూ.60.24 కోట్ల సొమ్మును 12 శాతం వడ్డీతో తక్షణం సొసైటీకి జమ చేయాలని డిమాండ్ చేశారు. రూ.370 కోట్ల టర్నోవర్‌తో 12 వేల మంది త్రిఫ్ట్ సొసైటీ సభ్యుల ఆర్థిక అవసరాలు తీరుస్తూ రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా ఉన్న ఉక్కు ఉద్యోగుల సొసైటీని ఆర్థికంగా దెబ్బతీయాలనే యాజమాన్యం చర్యలను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

ధర్నాలో సిఐటియు నేతలు యు.రామస్వామి, వైటి.దాస్, ఐఎన్‌టియుసి వెంటేశ్వరరావు , హెచ్‌ఎమ్ఎస్ దొమ్మేటి అప్పారావు, టిఎన్‌టియుసి గుమ్మడి నరేంద్ర కుమార్, బిఎమ్ఎస్ కొమ్మినేని శ్రీనివాస్, విఎస్ ఇయు రామ్ కుమార్, విఎస్ఎమ్ఎస్ మహాలక్ష్మినాయుడు, డిఐటియు ప్రసాద్ సంఘీభావం తెలిపారు. త్రిఫ్ట్ సొసైటీ ఉఫాధ్యక్షులు కెఆనంద్‌కుమార్, కార్యదర్శి డి.శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడుతూ సభ్యుల ప్రయోజనాల పరిరక్షణ, వారిపై ఆర్థికభారం పడకుండా అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ధర్నాలో పాల్గొన్న సభ్యులకు, సంఘీభావం తెలిపిన అఖిలపక్ష కార్మికసంఘాలకు సొసైటీ డైరక్టర్ కెశ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. . ధర్నా అనంతరం ఫైనాన్స్ డిజిఎం ఎస్.రామ ప్రసాద్‌కు వినత పత్రం అందచేశారు.



డిజిఎంకు వినతిపత్రం ఇస్తున్న త్రిఫ్ట్ పాలకవర్గం, అఖిలపక్ష కార్మికులు

ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టామనిఇన్‌ఛార్జి ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయనున్నట్లు తెలిపారు. మృతి చెందిన, శాశ్వత వలస పోయిన వారి ఓట్లను తొలగిస్తామన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల నమోదు చేపట్టి, వచ్చేనెల 25న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శిస్తామని స్పష్టం చేశారు. 1500మందికి మించి ఓటర్లుంటే పోలింగ్ కేంద్రాలను విభజిస్తామన్నారు. అలాగే 1500లోపు ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలను విలీనం చేస్తామన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో తహశీల్దార్ పి రామారావు, ఎలక్షన్ డిటి , టిడిపి నుంచి గంటా నూకరాజు, వైసిపి నుంచి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



సీమంతాలు చేస్తున్న కార్పొరేటర్

ప్రజాశక్తి - మధురవాడ : అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి పోషక విలువలతో కూడిన బలవర్థకమైన ఆహారం తీసుకోవాలని ఐదవ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. బుధవారం పోషకాహార మాసోత్సవాలలో భాగంగా మారికవలస అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార అవగాహనా సదస్సులో మాట్లాడుతూ, అంగన్వాడీ లబ్ధిదారులకు ప్రభుత్వపరంగా ఇస్తున్న బాలసంజీవని కిట్లలో ఉన్న బెల్లం, రాగిపిండి, అటుకులు, ఖర్జూరం, వేరుశనగ చెక్కిలతోపాటు గుడ్లు ఉంటున్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లల బరువు తగ్గకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు చేసి, పౌష్టికాహాకాహారాన్ని అందజేశారు. ముచ్చి రాముణాయుడు, దేవర శివ, మణ్యాల సురేష్, తాతారావు అంగన్వాడీ టీచర్ ఉమ, ఎంపిపి స్కూల్ ఉపాధ్యాయురాలు సునీత, ఎఎన్ఎం లోకేశ్వరి పాల్గొన్నారు.

అపోలోలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం



అపోలోలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఫైజర్ ఇండియా, అపోలో ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ అపోలో ఆసుపత్రిలో వయోజనుల వ్యాక్సినేషన్ కోసం కొత్తగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చారు. అపోలో ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రామ్‌చంద్ర.జె, ఫైజర్ వ్యాక్సినేషన్ డైరెక్టర్ మెడికల్ అఫైర్స్ డాక్టర్ సంతోష్ టౌర్ ఈ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయోజనులకు న్యుమోకాకల్ వ్యాధి, ఇన్‌ఫ్లూ ఎంజా, హ్యూమన్ పాపిల్లోమా వైరస్(హెచ్‌పివీ), హైపటైటిస్-ఎ,బి వంటి వ్యాధుల వ్యాప్తి నుంచి రక్షణకు ఇక్కడ టీకాలు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలఊపిరితిత్తుల వ్యాధి, డయాబెటీస్, క్రానిక్ హార్ట్, కిడ్నీ, కేన్సర్ వంటి వ్యాధుల నివారణకు సంబంధిత టీకాలు వేయడం చాలా అవసరమన్నారు.

ధరాభారం తగ్గించి ఆహార భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన డీజిల్, పెట్రోలు, వంట గ్యాస్‌తోపాటు బియ్యము పప్పులు వంటనూనె ఇతర నిత్యావసరాల ధరలను, విద్యుత్ ఇతరత్రా చార్జీలను తగ్గించాలని సిపిఐ నేత జి వామనమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధరాభారం తగ్గించి, ప్రజలకు ఆహార భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ దేశవ్యాప్తంగా ఈనెల 1 నుండి 6 వరకు ప్రజా ఆందోళన చేపట్టాలని ఇచ్చిన పిలుపులో భాగంగా శ్రీవిజయ దుర్గ ఆటో ఓనర్స్, కమ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ఇన్ గేట్ వద్ద గోడ పత్రిక ఆవిష్కరించారు.

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జె రాజారెడ్డి, సిపిఐ విశాఖ నగర నాయకులు జి వామనమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోడీ ధరలను పెంచి పేదల కడుపుకొట్టి, ప్రజాధనాన్ని అంబానీకి అదాని రిలయన్స్ వంటి కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్లలో రాయితీలు ఇస్తున్నారన్నారు. దీనిపై ప్రభుత్వాలు వెనక్కు తగ్గకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేష్, నాగరాజు ఆంజనేయులు, వై వెంకట్, రావి కృష్ణ, హెచ్ శేఖర్, జై గణేష్‌కుమార్, శ్రీను, అప్పలరాజు, గంగరాజు పాల్గొన్నారు.

జాతి నిర్మాణంలో యువత పాత్ర కీలకం

యంగ్ ఇండియన్స్ పార్లమెంట్‌లో ఎంపి పురంధరేశ్వరి

ప్రజాశక్తి -మధురవాడ : జాతి నిర్మాణం, ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణలో యువత పాత్ర కీలకమని ఎంపి డి.పురంధేశ్వరి అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) అనుబంధ యువజన విభాగం యంగ్ ఇండియన్స్ నిర్వహిస్తున్న యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ తక్షణ ఆవశ్యమన్నారు. పార్లమెంటరీ వ్యవస్థను యువత అర్థం చేసుకోవాలని, నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని సూచించారు. రాజ్యసభ సభ్యుడు జివిఎల్. నరసింహారావు మాట్లాడుతూ యువతను చైతన్యవంతం చేయడంలో యంగ్ ఇండియన్స్‌కృషిని అభినందించారు. కార్యక్రమంలో అత్యుత్తుమ ప్రతిభ కనబరిచిన యువతకు ఉత్తమ పార్లమెంటేరియన్, లీడం౯షిప్ ఎక్సలెన్స్, బెస్ట్ లీడర్ ఆఫ్ ద హౌస్, బెస్ట్ అపోజిషన్ లీడర్ ఆఫ్ ద హౌస్ అవార్డులను అందజేశారు.కార్యక్రమంలో యంగ్ ఇండియన్స్ జాతీయ అధ్యక్షుడు దర్శన్ ముతా, విశాఖ శాఖ అధ్యక్షుడు హర్షనందన్, డాక్టర్ బి.శ్రావణి, సదఫ్ మెహిది పాల్గొన్నారు.

పద్య పఠనంలో విజేతకు అభినందన

ప్రజాశక్తి -ఆనందపురం : గోపాలపట్నం జెడ్‌పి హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పద్యపఠనం పోటీల్లో ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బంక చాందిని ప్రథమ బహుమతి గెలుపొందారు ఈ వేడుకల్లో పద్యపఠనంతోపాటు నృత్యప్రదర్శన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచిన చాందినిని హెచ్‌ఎం రామకృష్ణ పట్నాయక్, తెలుగు ఉపాధ్యాయులు శంకరరావు, ముత్యాల నాయుడు, భాస్కరరావు తదితరులు అభినందించారు

డెంటల్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి -ములగాడ : ప్రజలకు అందుబాటు ధరల్లోనే నాణ్యమైన దంత వైద్యాన్ని అందించాలనే ఆలోచనతో శ్రీహరిపురంలో ఏర్పాటు చేసిన టిఎస్‌ఆర్ డెంటల్ క్లినిక్ ను బుధవారం 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పివి సురేష్ ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించి, మన్ననలు పొందాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కొయిలాడ రోజారాణి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : మైనర్లైన బాలబాలికల ప్రేమ వ్యవహారంలో మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హనుమంతువాక, సంజయ్‌గాంధీ కాలనీలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ద్వారకా సిఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం, సంజయ్‌గాంధీ కాలనీలో అమ్మమ్మ వద్ద నివాసం ఉంటున్న బాలిక, అదే ప్రాంతానికి చెందిన మరో బాలుడు ఒకే స్కూల్లో గతంలో చదువుకున్నారు. అప్పటి నుంచి వారు ప్రేమలో పడి, శారీరకంగా దగ్గరయ్యారు. వీరిద్దరూ తీసుకున్న వీడియోలు బాలిక తండ్రికి బాలుడు పంపించాడు. దీనిపై బాలిక తండ్రి నిలదీయడంతో మనస్తాపానికి గురైన బాలిక మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు కారణాలపై సిఐ రమేష్ వివరాలు సేకరిస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఎంవిపి పోలీసుస్టేషన్ పరిధిలో బంగారం చోరీకేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ద్వారకా క్రైమ్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఎంవిపి పోలీసుస్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎంవిపి.కాలనీ సెక్టర్ -12లోని బి.అన్నపూర్ణ ఇంట్లో ఆగస్టు నెలలో బ్యాగులో దాచుకున్న రెండు బంగారు గాజులు, నగదు చోరీ జరిగినట్లు. ఈ నెల 2వ తేదీన ఆమె ఎంవిపి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. ఎసిపి వెంకటరావు ఆధ్వర్యాన దర్యాప్తుచేపట్టగా జాలరి ఎండాడలో నివాసముంటున్న జంధ్యాల హేమచందు (33)ను నిందితునిగా గుర్తించామని తెలిపారు. నిందితుడ్ని వాసవానిపాలెం వద్ద బుధవారం అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అతని నుంచి రెండు బంగారు గాజులు, నగదు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు వివరించారు.

మట్టి గణపతుల పంపిణీ



వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కీర్తి పట్నాయక్

ప్రజాశక్తి- మాధవధార : కాలుష్య రహితం, పర్యావరణ హితమైన వినాయకచవితిని జరుపుకోవాలని శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు కీర్తి పట్నాయక్ కోరారు. బుధవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో కాలుష్యనియంత్రణ మండలి సహకారంతో మురళీనగర్ జివిఎంసి హైస్కూల్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మట్టి గణేశ ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి ఆర్,చంద్రశేఖర్, హెచ్‌ఎం హేమలత, జివిఎంసి సూపర్వైజర్ గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

ప్రజాశక్తి- సీతమ్మధార : 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వీ మీనాక్షి ఆధ్వర్యంలో బుధవారం ఆసుపత్రిలో రోగులు, వారి బంధువులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఆప్తాల్మాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రభాకరశాస్త్రి మాట్లాడుతూ నల్ల గుడ్డు అంధత్వం బారిన పడి అనేక మంది చూపు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు

ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ, నేత్రదానంపై ప్రజలు అపోహలు వీడాలని, దీనిప అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం చేస్తామని ప్రతిఒక్కరితో ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆర్ఎంఒ డాక్టర్ నవీన్‌కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెడ్ నర్స్ రాజేశ్వరి, పిఎంఒలు ఉమా శ్రీనివాస్, సురేష్, కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత,పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

విజయవాడ వరద బాధితులకు

సిపిఎం విరాళాల సేకరణ



విరాళాలను సేకరిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- పెందుర్తి : విజయవాడ వరద బాధితులకు జివిఎంసి 97వ వార్డు సుజాతనగర్‌లో బుధవారం సాయంత్రం సిపిఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి బి.రమణి మాట్లాడుతూ వర్షాలు, వరదలతో విజయవాడలోని కొన్ని ప్రాంతాలు అతలాకుతలమయ్యాయని, బాధితులను మానవతాదృక్పథంతో ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కేరళ వరద బాధితులకు సిపిఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టి, అక్కడ ముఖ్యమంత్రికి అందజేశామని, ఇపుడు విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాలను సేకరిస్తున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో సిఐటియు నాయకులు శంకరరావు, అప్పలనాయుడు, ఈశ్వరరావు, ప్రభుదేవా, పూర్ణ, బాబూరావు, విజయ మహేష్ పాల్గొన్నారు.

సిఐల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -మధురవాడ: పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్‌లో శాంతి భద్రతల విభాగం సిఐగా జి.బాలకృష్ణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. విశాఖ రేంజ్ కార్యాలయంలో విఆర్‌లో ఉన్న ఆయనను పిఎంపాలెం స్టేషన్‌కు సిఐగా బదిలీ చేయగా విధుల్లో చేరారు. కాగా ఇక్కడ పనిచేసిన సిఐ రామకృష్ణను విఆర్‌కు బదిలీ చేశారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని కొత్త సిఐ బాలకృష్ణ అన్నారు.

భీమునిపట్నం : భీమిలి సిఐగా బొడ్డేపల్లి సుధాకర్ బుధవారం భాద్యతలు చేపట్టారు. అల్లూరి జిల్లా పాడేరులో సైబర్ సెల్ విభాగంలో సిఐగా పనిచేసిన ఆయనను భీమిలి బదిలీ చేయగా, విధుల్లో చేరారు. ఇక్కడ సిఐ డి.రమేష్‌ను విశాఖ రేంజ్ విఆర్‌కు బదిలీ చేశారు.

పోషకాహారంతోనే జీవన నాణ్యత

కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ డైటిషియన్ డాక్టర్ శిరీష



డైటీషియన్ డాక్టర్ శిరీష

ప్రజాశక్తి -గాజువాక.: ఆరోగ్యకరమైన ఆహారంతోనే మనిషి అందమైన జీవితం ఆధారపడి ఉంటుందని, కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కన్సల్టెంట్ డైటీషియన్ డాక్టర్ శిరీష తెలిపారు. జాతీయ పోషకాహార వారోత్సవాల సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం, సంక్షేమంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా జీవన నాణ్యత మెరుగుపడుతుందన్నారు. పోషకాహార సమస్యతో అనారోగ్యం, వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. ఈ ఏడాది జాతీయ పౌష్టికాహార వారోత్సవాలను 'ఫీడింగ్ స్మార్ట్ రైట్ ఫ్రమ్ స్టార్ట్' (ప్రారంభం నుండి సరైన పద్ధతిలో ఆహారం అందించడం)థీమ్‌తో ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. స్మార్ట్ ఆహారం ద్వారా పిల్లలు జననం నుండే సరైన పోషకాహారాన్ని పొందే విధంగా సరైన పోషక విధానాలపై ప్రజలకు అవగాహనకు శిక్షణ, సదస్సులు, రోడ్‌షోలు, ర్యాలీలు, పోటీలు, వివిధ ప్రచార కార్యాక్రమాల ద్వారా చైతన్యపరచడమే వారోత్సవాల ఉద్దేశ్యమన్నారు.పోషక సమస్యల పరిష్కారం, నివారణకు సరైన ఆహార ప్రణాళికలను రూపొందించడం, రోగులకు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, సమతుల ఆహారంపై చైతన్యవంతులను చేయడం. రోగుల పోషక స్థితిని పర్యవేక్షించి, డైట్ కౌన్సెలింగ్ ద్వారా వ్యాధుల నుంచి విముక్తికి దోహదపడడం వంటి కార్యక్రమాలను అనుభవజ్ఞులైన డైటీషియన్లు, వైద్యనిపుణుల సేవల అవసరం ఉందన్నారు. కిమ్స్ ఐకాన్ హాస్పిటల్స్ పోషకాహార విభాగంలో రోగులకు పోషక సంరక్షణ అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి స్థాయిలో రోగుల భద్రత, నాణ్యమైన చికిత్స అందించడం. రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచడం, వారికి జీవితంలో విజయం సాధించేలా చేయడమే ధ్యేయమన్నారు.

సమ సమాజం కోసం పరితపించిన పుష్పాంజలి

● సంతాపసభలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు



సంతాపసభలో మాట్లాడుతున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్/ మాధవధార : దోపిడీ పోవాలి, సమ సమాజం రావాలనే లక్ష్యంతో చివరి వరకు పనిచేసిన గొప్ప ధీశాలి పుష్పాంజలి సాహు అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కొనియాడారు. బుధవారం కంచరపాలెం బిఎన్ఆర్ భవనంలో సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఐద్వా జోన్ కార్యదర్శి పుష్పాంజలి సాహు సంతాపసభ నిర్వహించారు. సాహూ చిత్రపటానికి జగ్గునాయుడు తోపాటు ఐద్వా, సిపిఎం నేతలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జోన్ ఐద్వా కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సంతాపసభలో జగ్గునాయుడు మాట్లాడుతూ.తుదిశ్వాస విడిచే వరకు ప్రజల కొరకు,పార్టీ కొరకు పనిచేసి, పార్టీ జెండాను కప్పుకుని వెళ్లేవారే నిజమైన కమ్యూనిస్టులని,వారి కోవకు చెందిన పుష్పాంజలి ధన్యజీవి అన్నారు. మూఢనమ్మకాలు విడనాడి శాస్త్రీయఆలోచనతో ముందుకు వెళితే సమాజం అభివృద్ధి చెందుతుందని నమ్మిన వ్యక్తి సాహూ అన్నారు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ మాట్లాడుతూ, 2006లో ఐద్వాలో చేరిన పుష్పాంజలి, మహిళా సమస్యలపై చురుగ్గా పోరాడడంతోపాటు అన్ని కార్యక్రమాల్లో ప్రత్యక్షమయ్యేవారన్నారు. ఐద్వా కంచరపాలెం జోన్ అధ్యక్షులుగా ఎక్కువ కాలం పనిచేసారని, ప్రస్తుతం జోన్ కార్యదర్శిగా వున్నారన్నారు. సుభాష్ నగర్, తుమ్మడపాలెం గజపతి నగర్, సంకురపేట ప్రాంతాల్లో డ్వాక్రా మహిళలతో సన్నిహిత సంబంధం కలిగి, స్థానిక, మహిళా సమస్యలపై పనిచేశారన్నారు. కుటుంబ సమస్యలపై లీగల్ సెల్ నిర్వహించి, కౌన్సిలింగ్ ఇప్పించడం ద్వారా బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచారన్నారు. భర్త, పిల్లలు, కోడలు ఇలా అందరినీ సిపిఎం, ప్రజాసంఘాల్లో భాగస్వామ్యం చేసి, చివరి వరకు క్రమశిక్షణ, నిబద్ధత గల కార్యకర్తగా పనిచేశారన్నారు. బాలలు, డ్వాక్రా మహిళాసంఘాతోపాటు సిపిఎం బలోపేతం చేయడంలో అవిశ్రాంతంగా శ్రమించిన పుష్పాంజలి పాత్ర ఎనలేనిదన్నారు.

పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.జగన్ మాట్లాడుతూ కేన్సర్ మహమ్మారి బలిగొన్న పుష్పాంజలి లేనిలోటు అటు కుటుంబానికి, పార్టీకి తీరని లోటన్నారు. కేన్సర్‌కు కారణమైన కాలుష్యంపై ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పుష్పాంజలి భర్త మోహనరావు మాట్లాడుతూ, అన్యోన్యంగా సాగిన తమ దాంపత్య జీవితంలో పుష్పాంజలి తనకు సలహాలిచ్చి ఉద్యమంలో ముందుండి నడిపించిందన్నారు.

సంతాప సభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, బి.వెంకటరావు, వి.కృష్ణారావు, పి.మణి, కె.రమాప్రభ, ఐద్వా సీనియర్ నాయకులు ఎం.సుజాత, ఐద్వా జిల్లా నాయకులు బి.భారతి, డి. కొండమ్మ ,కె.కుమారి, ఓ. విజయ, వి.ప్రభావతి, లీలావతి, ఎస్.విజయలక్ష్మి, కె.అనురాధ సిఐటియు జోన్ అధ్యక్ష, కార్యదర్శులు బి. సింహాచలం, ఒ.అప్పారావు, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు, బిఎన్ఆర్ ఫౌండేషన్ నాయకులు ఎస్.అప్పలరాజు, పి.రామారావు, జి. సూర్యచంద్రరావు, ఎస్. సోమేశ్వరరావు, కె. పార్వతి, ఎస్.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

● కుసులవాడ కొండను పరిశీలించిన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక బృందం



కొండలను పరిశీలిస్తున్న వేదిక ప్రధాన కార్యదర్శి అజ శర్మ

ప్రజాశక్తి- ఆనందపురం: పర్యావరణానికి హని కలిగించే కుసులవాడ మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజ శర్మ డిమాండ్ చేశారు. బుధవాదం వేదిక బృందం కుసులవాడ మైనింగ్ కొండను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అజ శర్మ మాట్లాడుతూ, కుసులవాడ భూముల్లో క్వార్ట్ జైట్ మైనింగ్‌కు కేంద్ర ప్రభుత్వం ఎస్ 1533 నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కుసులవాడలో 104 సర్వేనెంబరులోని 69 హెక్టార్లలో 7.991 హెక్టార్లలో రఫ్ స్టోన్ గ్రావెల్, క్వార్ట్ జైట్ మైనింగుకు విఆర్ ఇన్ఫ్రా అండ్ టెక్నాలజీస్ ప్రైవేట్ సంస్థకు అనుమతులు ఇచ్చిందనాన్నరు. కొండలు, ప్రకృతిని ధ్వంసం చేస్తే పర్యావరణానికి, ప్రజలకు తీవ్ర ప్రమాదమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియదా? అని ప్రశ్నించారు. ప్రకృతి సంపదను రక్షించాల్సిన ప్రభుత్వాలే వాటి విధ్వంసానికి పూనుకోవడం అమానుషమన్నారు. కుసులవాడ కొండల ధ్వంసంతో ఇక్కడి జీడి, మామిడి, కొబ్బరి తోటలతో పాటు ఇతర పంటలకు ఆపార నష్టం కలుగుతుందన్నారు కుసులవాడ ఎస్‌సి కాలనీ, చిన్నయ్యపాలెం ఎస్‌టి కాలనీ, రేగానిగూడెం, గొల్లలపాలెం, ఇచ్ఛాపురం తదితర గ్రామాలకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. రుషికొండలో వైసిపి ప్రభుత్వ ప్రకృతి విధ్వంసంపై సిపిఎంతో కలిసి పోరాడిన టిడిపి, ఇపుడు కుసులువాడ కొండలను కాపాడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మైనింగ్‌కు ఇచ్చిన అనుమతులన్నీ రద్దుచేసి, సన్నద్ధమౌతున్న అధికారయంత్రాంగాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పర్యటనలోఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక సభ్యులు కూన వెంకటరావు, ఎం ప్రదీప్, పి ప్రసాద్, సిఐటియు భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి ఉన్నారు.

గణపతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ గోవిందు, ఇఒ రమాబాయి

ప్రజాశక్తి - సీతమ్మధార : సీతంపేటలో దుర్గా గణపతి నవరాత్రి ఉత్సవాలను ఈనెల 7 నుంచి నిర్వహిస్తున్నట్లు స్థానిక టిడిపి వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవిందు తెలిపారు బుధవారం దుర్గ గణపతి ఆలయంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, 1992లో ప్రారంభించిన దుర్గా గణపతి ఆలయంలో 32ఏళ్లుగా గణపతి ఉత్సవాలను ఏటా ఆనవాయితీగా, ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు ప్రత్యేకపూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నామన్నారు తొమ్మిదిరోజులపాటు దుర్గాగణపతి రోజుకో రూపంలో దర్శనమిస్తారన్నారు. ఈనెల 16న గణపతి ఉత్సవాల సందర్భంగా ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.కార్యక్రమంలో ఆలయ ఇఒ రమాబాయి. వెంకటరావు, దేవేంద్ర. ఓమ్మి ఆనందం, వానపల్లి లక్ష్మణ్, ఎల్లాజీ బుజ్జి శ్రీను పాల్గొన్నారు

భీమిలిలో కలెక్టర్ విస్తృత పర్యటన

హైస్కూళ్లు, అంగన్వాడీలు, యుపిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ : పురాతన డచ్ సమాధుల సందర్శన



అంగన్వాడీ చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరింధిర ప్రసాద్

ప్రజాశక్తి -తగరపువలస : జిల్లా కలెక్టర్ హరింధిరప్రసాద్ బుధవారం భీమిలి జోన్‌లో సుడిగాలి పర్యటన చేశారు. చిట్టివలస బాలురు, బాలికల జెడ్‌పి ఉన్నత పాఠశాలలను, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో 6, 10 తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. ఫిజిక్స్, సోషల్, జాగ్రఫీ పాఠ్యాంశాల్లో పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. బాలికల ఉన్నత పాఠశాల లో 6,10 తరగతుల విద్యార్థులకు రాజ్యాంగం, చట్టాలు, వాటి అమలు, న్యాయ వ్యవస్థ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలు, లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ, శాసనమండలి ఏర్పాటు, శాసన,పరిపాలన, న్యాయ వ్యవస్థల ప్రాధాన్యతలను వివరించారు. శాటిలైట్, సోలార్ సిస్టమ్, విశ్వం, సోలార్ పవర్ ,హైడల్ పవర్ తది తర అంశాల అవశ్యకతపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఏ రోజు పాఠాలు, అదే రోజున ఇంటికి వెళ్ళి నెమరు వేసుకోవాలని, సమయాన్ని వృథా చేయవద్దని విద్యార్థులకు స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనం, మెనూ అమలుపై విద్యార్థులను కలెక్టర్ అడిగారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ వెంట డిఇఒ ఎల్ చంద్రకళ, ఎంఇఒ, ఎం శివ రాణి, తహశీల్దార్ పి రామారావుఉన్నారు.

అంగన్వాడీ కేంద్రం సందర్శన..

కొండపేట అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ చిన్నపిల్లలతో కాసేపు ముచ్చటించారు. గర్భిణులకు పోషణ కిట్లను అందజేశారు. నెలల చిన్నారికి అన్న ప్రాశన చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి, బాల సదనం సూపరింటెండెంట్ ప్రమీల పాల్గొన్నారు

యు పి హెచ్ సి సందర్శన.

భీమిలి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు ఉన్నారు.

పురాతన డచ్ సమాధుల సందర్శన..

భీమిలిలోని పురాతన డచ్ సమాధులను,. లైట్ హౌస్, తొట్లకొండ, బావి కొండలను కలెక్టర్ సందర్శించారు. పర్యాటక శాఖ అధికారులు, ఒకటో జోన్ కమిషనర్ కె కనక మహా లక్ష్మి పాల్గొన్నారు

జిల్లా అంతటికీ ఒకే రోజు

సదరం క్యాంపు నిర్వహణపై ఎమ్మెల్యే కొణతాల ఆగ్రహం

రోజుకు మూడు మండలాల చొప్పున ఏర్పాటు చేయాలని సూచన



సదరం క్యాంపుకు పెద్ద సంఖ్యలో హాజరైన వికలాంగులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా వ్యాప్తంగా ఉన్న వికలాంగులకు ఒకే రోజు సదరం క్యాంపు ఎలా నిర్వహిస్తారని, దీనివల్ల వికలాంగులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటారని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రిలో బుధవారం జరిగిన సదరం క్యాంపును ఆయన పరిశీలించారు. కనీస వసతులు, ఇతర శాఖలతో సమన్వయం లేకుండా జిల్లా వ్యాప్తంగా క్యాంపు ఎలా నిర్వహిస్తారని మండిపడ్డారు. తక్షణమే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మండలాల వారీగా క్యాంపు నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అక్కడ పరిస్థితిపై ఆరా తీసి తొక్కిసలాట జరిగే ప్రమాదం ఉందని, మొత్తం ఆసుపత్రికి వచ్చే రహదారులు అన్ని జిల్లా వ్యాప్తంగా వచ్చిన వికలాంగులతో స్తంభించిపోయాయన్న విషయాన్ని తెలుసుకుని కొణతాల రామకృష్ణ వెంటనే క్యాంపు నిలిపివేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి ఏర్పాట్లపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే రోజుకు 3 మండలాల చొప్పున క్యాంపు నిర్వహించేలా షెడ్యూల్ తయారు చేయాలని, ఎన్టీఆర్ స్టేడియంలో క్యాంపు నిర్వహించాలని కోరారు. క్యాంపుకు వచ్చే వికలాంగులకు కావలసిన సదుపాయాలను మొత్తం సొంత ఖర్చులతో తానే చూసుకుంటానని రామకృష్ణ తెలియజేశారు.

ఎన్టీఆర్ స్టేడియంలో మండలాల వారీగా సదరం క్యాంపులు

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆయా మండలాలకు కేటాయించిన తేదీల్లో ఆ మండలాల వికలాంగులకు సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా ఆసుపత్రిలో సేవల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా అర్హత పెన్షన్‌కు సదరం క్యాంపుకు హాజరు అయ్యే వికలాంగులు 80శాతం అంగవైకల్యంతో పాటు బహుళ వ్యాధిగ్రస్తులై ఉండాలని కోరారు. తలసేమియా మేజర్, సికిల్ సెల్ వ్యాధి, తీవ్రమైన హిమోఫిలియా, బోధ వ్యాధి, పక్షవాతంతో మంచానికే పరిమితమైన వ్యక్తి, తీవ్రమైన కండరాల క్షీణత, ప్రమాదాల్లో మంచానికి, చక్రాల కుర్చీకి పరిమితమైన వారు, తీవ్రమైన కిడ్నీ వ్యాధిగ్రస్తులు, బహుళ వైకల్యం లెప్రసి, కిడ్నీ కాలేయం గుండె మార్పిడి చేయించుకున్న వారు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 5న రాంబిల్లి అచ్యుతాపురం, మునగపాక, 6న పరవాడ అనకాపల్లి పట్టణం, అనకాపల్లి మండలం, చోడవరం, 9న సబ్బవరం, కె.కోటపాడు, దేవరాపల్లి, 10న చీడికాడ, మాడుగుల, బుచ్చయ్యపేట, 11న కసింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, 12న రోలుగుంట, రావికమతం, మాకవరపాలెం, 13న నాతవరం, గొలుగొండ నర్సీపట్నం, 17న కోటవురట్ల, నక్కపల్లి పాయకరావుపేట మండలాల వికలాంగులకు సదరం క్యాంపు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.



విరాళాలు సేకరణ చేస్తున్న సిఐటియు నాయకులు

విజయవాడ వరద బాధితులకు
సిఐటియు విరాళాలు సేకరణ

ప్రజాశక్తి-పరవాడ

విజయవాడ వరద బాధితుల సహాయార్థం పరవాడ మండల కేంద్రం సినిమా హాల్ జంక్షన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం విరాళాల సేకరణ చేపట్టారు. సిఐటియు నాయకులు షాపులు వద్దకు వెళ్లి వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ హుద్‌హుద్ తుఫాన్‌కు విశాఖపట్నం ఏ రకంగా నష్టపోయిందో, నేడు విజయవాడ నగరం కూడా వరదలతో తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ విరాళాలు ఇచ్చి బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే నాయుడు, జి శ్రీనివాసరావు, సత్తిబాబు, లచ్చిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా మల్లేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లేశ్వరరావు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా టి.మల్లేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌కి చెందిన మల్లేశ్వరరావు గతంలో పెదబయలు, సబ్బవరం, కె.కోటపాడు, పరవాడ మండలాల్లో ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మల్లేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఎస్సై మల్లేశ్వరావును తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ కడిమి నాగేశ్వరరావు సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

పూడిమడకలో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండడలంలోని పూడిమడక శివారు కడపాలెం రుద్ర భూమిలో ఆక్రమణలను అధికారులు తొలగించారు. ఇక్కడ సర్వే నెంబరు 85/4లో నాలుగు ఎకరాల 34 సెంట్లు భూమి ఆక్రమణకు గురైంది. దీంతో దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు బుధవారం పంచాయతీ అధికారులు ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

పచ్చదనం, పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి- సబ్బవరం : పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం, పరిశుభ్రత అవసరమని జిల్లా పంచాయితీ అధికారి శిరీషారాణి అన్నారు. మండలంలోని బోదువలస, ఎల్లుప్పి, గుల్లేపల్లి గ్రామపంచాయతీల్లో బుధవారం ఆమె పర్యటించారు. పారిశుధ్యం పనులను పరిశీలించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులందరూ పారిశుధ్యం, నీటి సరఫరా, ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. జిల్లా కో ఆర్డినేటర్ నాగలక్ష్మితో కలిసి ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌లలో వానపాములు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మహేష్, గుల్లేపల్లి, బోధువలస, ఎల్లుప్పి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

ఉమెన్ సేఫ్టీ సెల్ ప్రారంభం



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి దీపిక తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళలు, బాలికల భద్రత దృష్ట్యా ప్రత్యేక ఉమెన్ సేఫ్టీ సెల్ ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్‌పి ఎం.దీపిక పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఉమెన్ సేఫ్టీ సెల్‌ను వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై జరిగే హింసను అరికట్టేందుకు, మహిళల భద్రతకు భరోసా కల్పించేందుకు ఉమెన్ సేఫ్టీ సెల్ అవసరమని చెప్పారు. ఈ సెల్ అనకాపల్లి మహిళా పోలీసు స్టేషన్‌కు అనుబంధంగా పనిచేస్తుందని తెలిపారు. హోమ్‌మంత్రి, జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ మహిళలు ఉండడం ప్రత్యేకత సంతరించుకుందన్నారు. విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే కార్యాలయాలు, ప్రదేశాలు, గ్రామాల్లో పోక్సో యాక్ట్, ఇతర మహిళా చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గృహహింస, సైబర్ క్రైమ్స్ తదితర అంశాలపై ప్రచార వాహనం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో మహిళలు, బాలికలు వేధింపులకు, హింసకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా సాధికారత సాధించేందుకు ఇటువంటి మంచి కార్యక్రమంలో భాగస్వామి అయినందుకు సెయింట్ గోబిన్ సంస్థను అభినందించారు. అనంతరం మహిళలపై జరిగే నేరాలకు సంబంధించి ప్రచార పోస్టర్లను జిల్లా ఎస్పీ, సెయింట్ గోబిన్ సంస్థ ప్రతినిధులు గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు అందజేశారు. సెయింట్ గోబిన్ సంస్థ అచ్యుతాపురం, ప్లాంట్ హెడ్ సర్వన్ కుమార్, ప్లాంట్ హెచ్‌ఆర్ మేనేజర్ శివప్రసాద్‌కు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, కె.లక్ష్మణమూర్తి, ఎస్.లక్ష్మణమూర్తి, వినోద్ బాబు, ఎస్సైలు రఘువర్మ, యమున, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - యలమంచిలి

జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, ఫెస్ట్ కంట్రోల్ కార్మికులకు జీతాల బకాయిలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, జిల్లా కమిటీ సభ్యులు చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం విచారకరమన్నారు. పారిశుద్ధ్య కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని వాపోయారు. ఈఎస్ఐ, పిఎఫ్ కూడా కాంట్రాక్టర్లు సకాలంలో చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.16,500 ఇస్తామని జిఓలో పేర్కొన్నా, నేటికీ అమలు చేయలేదన్నారు. కాంట్రాక్టర్ల దోపిడీని అరికట్టాలని కోరారు. కార్మికుల చేస్తున్న ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో నిర్దేశించిన గృహ నిర్మాణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో బుధవారం గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 6,276 (రూఫ్ లెవెల్, రూఫ్ కంప్లీటెడ్) గృహ నిర్మాణాలను వంద రోజుల్లో పూర్తి చేయవలసిందిగా లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని తెలిపారు. ఈనెల 20వ తేదీ నాటికి శత శాతం పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. లక్ష్యసాధనలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా 90 రోజుల పని దినాలు కల్పించడంపై కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చీడికాడ, అనకాపల్లి రూరల్, కోటవురట్ల, గొలుగొండ, అచ్యుతాపురం, మండలాల ఏఈలు లక్ష్యసాధనలో మరింత మెరుగైన పనితీరును కనపరచాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచిదేవి, జిఎస్‌డబ్ల్యూ ఎస్ ప్రత్యేక అధికారి మంజుల వాణి, గృహ నిర్మాణ శాఖ డిఈలు, ఇఇలు, ఏఈ లు, వర్క్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక జగనన్న కాలనీలో గ్రావెల్ రోడ్డుతో పాటుగా హ్యాండ్ బోర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కాలనీకి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో కాలనీవాసులు ఫిర్యాదు మేరకు స్థానికులతో కలిసి బుధవారం కాలనీ మార్గాన్ని పరిశీలించారు. స్పందించిన సత్యనారాయణ తన జిల్లా పరిషత్ నిధుల నుండి రూ.6 లక్షల నిధులు మంజూరు చేసి తక్షణం పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, నాయకులు బొడ్డేడ మహేష్, పిల్లి అప్పారావు, పోలవరపు రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.



జగనన్న కాలనీని సందర్శించిన జెడ్‌పిటిసి, వైసిపి నాయకులు

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల వివరాలను జిల్లా విద్యాశాఖ బుధవారం విడుదల చేసింది. ప్రధానోపాధ్యాయుల్లో కె.శ్రీరామ్మూర్తి (ఎలమంచిలి మండలం పులపర్తి జెడ్పిహెచ్‌స్కూల్) ఎంజె రవీంద్రబాబు (బుచ్చయ్యపేట మండలం తురకలపూడి), ఆళ్ల సుధాకర్ (ఎస్ రాయవరం మండలం పెద్ద గుమ్ములూరు) ఉన్నారు. ఉపాధ్యాయుల్లో సిహెచ్‌వివి సత్యనారాయణ (పెదబోడిగళ్లం), వై శ్రీనివాసరావు (తాళ్లపాలెం), కె.వీరు నాయుడు (ఉప్పరపల్లి), పి.రామంత బాబ్జి (అనకాపల్లి జీవీఎంసీ), ఎస్ ప్రభాకర్ (జన్నవరం), ఎ.శ్రీనివాసరావు (అప్పలరాజు పురం), కే.సంపతరావు (ఉప్పరపల్లి), భాస్కర శారద (రేవు పోలవరం), బి పద్మజ రవిబాబు (గుంటపల్లి), కేకేఎల్ఎన్ ధర్మారావు (గుర్రాజుపేట), ఎం భానుశ్రీ (పెద్ద గుమ్ములూరు), సిహెచ్ విమలాదేవి (డిహెచ్ అగ్రహారం), జె రాణి ఫ్లోరెన్స్ (ఎలమంచిలి ఆర్ఎస్ రోడ్డు), పి వరలక్ష్మి (కొత్తపేట), జె.అమృతరావు (ఎ.కోడూరు), వై శ్రీనివాసరావు (గుంటపల్లి), డి.పినాకపాణి (సబ్బవరం వంగలి) ఉన్నారు. ఎస్‌జిటిల్లో రోట్బి లక్ష్మి (వెంకటాపురం మునగపాక), వి శ్రీదేవి (ఎదటం పాయకరావుపేట), పిళ్లా వెంకటఆనంద్ (వి.మాడుగుల వీరనారాయణం), మల్ల శ్రీనివాస్ (ఎలమంచిలి శాకలాపురం), రావాడ త్రినాధరావు (కే.కోటపాడు), రావాడ సునీత (వియన్ పేట సర్వీపట్నం), టేకి రాజు కిరణ్ (కసింకోట మోసయ్యపేట), ఎస్ వీరాంజనేయులు (పివి పాలెం కే కోటపాడు), బివిపి మహేశ్వరి (మంచాల చీడికాడ), కె రవికుమార్ (రత్నంపేట రోలుగుంట), బి సూర్యనారాయణ (వేలం కాయల పాలెం రోలుగుంట), జి రాజశేఖర్ (ఎలమంచిలి చినగొల్లపాలెం), ఎవి రామచంద్రరావు (అనకాపల్లి టౌన్ గర్ల్స్ హైస్కూల్), ఎ రమణ మూర్తి (లింగంపేట గొలుగొండ), ఎ.అప్పాజీరావు (కొక్కిరాపల్లి ఎలమంచిలి), కే.నూకేశ్వరరావు (గాంధీ నగరం అనకాపల్లి), వై నరసింహమూర్తి (వైబి పట్నం రోలుగుంట), ఎస్‌టిపి విద్యావతి (టి అర్జాపురం రావికమతం) ఎంపికయ్యారు.

పిఎం ప్రకటించిన పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎసెన్షియా ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రధానమంత్రి ప్రకటించిన రూ.2 లక్షలు చొప్పున పరిహారం వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము డిమాండ్ చేశారు. ఎస్ఈజెడ్ కాలనీలో ప్రమాదంలో చనిపోయిన చిన్నారావు చిత్రపటం వద్ద బుధవారం సిఐటియు ప్రతినిధులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రూపాయలు కార్మికుల కుటుంబాలకు నేటి వరకు అందలేదన్నారు. ప్రమాదానికి కారణమైన యాజమాన్యాన్ని అరెస్ట్ చేసి శిక్షించాలని కోరారు. ఈ సంతాప కార్యక్రమంలో అప్పలనాయుడు, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు వితరణ

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1990 -91 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ చదువుకున్న స్కూలుకు 2 సీలింగ్ ఫ్యాన్లు, 10 ట్యూబ్‌లైట్లును బుధవారం అందజేశారు. వీరిని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వేగి దేవత నాయుడు, దాడి సాంబశివ, పెతకంశెట్టి భాస్కరరావు, దాడి వీరవెంకట సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులపై అవగాహన

ప్రజాశక్తి-పరవాడ : ఎపి విపత్తు స్పందన, అగ్ని మాపక సేవల శాఖ ఆధ్వర్యాన అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు, లైఫ్ సేవింగ్, వంటి అంశాలపై బుధవారం మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫైర్ సిలిండర్ నుంచి వచ్చే మంటలను ఏ విధంగా ఆర్పివేయాలి, వంటింట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ నుండి మంటలు రేగినప్పుడు ఆ మంటలు అదుపులోకి తేవడం ఎలా? నీటిలో మునిగిపోకుండా లైఫ్ బాయ్, లైఫ్ జాకెట్ ధరించడం ఎలా? తదితర విషయాలను తెలియజేశారు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగిన వెంటనే 101కి ఫోన్ చేయాలని సూచించారు. విద్యార్థులకు ఉపయోగకరమైన అంశాలు నేర్పిన అగ్నిమాపక అధికారి బి.నర్సింగ్‌రావుకు ఇతర సిబ్బంది కె.లక్ష్మణ్‌రావు, ఎస్.ప్రసాద్‌రావు, కె.నానాజీ, సతీష్, శంకర్ తదితరులకు స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ కె.నిశాంత్, పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బుధవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 75 మంది రోగులకు కంటి పరీక్షలు చేయగా వీరిలో 30 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేశారు. వీరిని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఆసుపత్రి వైద్యాధికారి పూజ్య మేఘన తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ అప్తలమిక్ ఆఫీసర్ సత్యవతి, క్యాంప్ కో ఆర్డినేటర్లు సిహెచ్ అశ్వనీకుమార్, కె.ప్రసాద్, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిని పరిశీలించిన టాస్క్‌ఫోర్స్ బృందం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారి డాక్టర్ లూసి కార్డియా మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండే కిశోర బాలికల ఆరోగ్యం మెరుగ్గా ఉంటే వాళ్లకు వివాహం జరిగిన తరువాత గర్భం దాల్చి పుట్టే పిల్లల ఆరోగ్యవంతంగా పుడతారని, దీని వల్ల మాతా శిశు మరణాలు నివారించవచ్చని చెప్పారు. క్షేత్ర స్థాయిలో రికార్డులు తనిఖీ చేసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 26 మందికి పిల్లలకు రక్తపరీక్షలు, కరకలో ఐదుగురు, తురకలపూడిలో ఐదుగురికి రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ సునీల్, ఎంపిహెచ్ఓ కెవి.రాజశేఖర్, పీహెచ్ఎన్ సీతమ్మ, హెచ్‌వి రమణ, సాంబశివ పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డులో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి -చోడవరం మెయిన్ రోడ్లోని తుమ్మపాల వద్ద డివైడర్, దానికి ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలను బుధవారం పంచాయితీ సర్పంచ్ తట్ట వెంకయ్య నాయుడు, ఈవో ఈశ్వరరావు ఆధ్వర్యంలో ట్రాక్టర్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెంటయ్య నాయుడు మాట్లాడుతూ ఈ తుప్పల వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటి వల్ల పలుమార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని తెలిపారు. న్నారు. జిల్లా పంచాయతీ అధికారి శిరీష ఆదేశాల మేరకు తొలగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ బ్యాంక్ మాజీ చైర్మన్ పిడి గాంధీ, పంచాయతీ సెక్రటరీ ఈశ్వరరావు, చదరం చిన్న పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

జిల్లా ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : గణేష్ ఉత్సవాలు ఉత్సవాలను కమిటీలు శాంతియుతంగా నిర్వహించాలని జిల్లా ఎస్‌పి ఎం.దీపిక బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణలో అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డింగు డ్యాన్సులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాల పేరుతో బలవంతంగా చందా వసూళ్ళకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. వినాయక ఉత్సవాలు నిర్వహించబోయే వారు ముందుగా కమిటీగా ఏర్పడి, అనుమతులు పొందాలన్నారు. ఉత్సవాల నిర్వహణలో ప్రతీ ఒక్కరూ మత సామరస్యాన్ని పాటించాలని, ఇతర మతాల వారికి ఎటువంటి ఇబ్బందులు గురి చేయకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఉత్సవాలను బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించి నట్లయితే సంబంధిత పంచాయతీ/ మున్సిపల్ అధికారుల నుండి అనుమతులు పొందాలని, అదే విధంగా ప్రైవేటు స్థలాల్లో నిర్వహిస్తే సంబంధిత స్థల యజమానుల నుండి ముందుగా అనుమతులు పొందాలని సూచించారు. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. మైకులు, సౌండు బాక్సులతో ప్రజలకు ఇబ్బందులు గురి చేయకూడదని, నిర్దేశించిన సమయం, నిర్దేశించిన సౌండును మాత్రమే వినియోగించాలని, దీనికి తప్పనిసరిగా అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో కమిటీ సభ్యులు 24/7లో అందుబాటులో ఉండాలని, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం సమయంలో ప్రమాదకరమైన రంగులు జల్లు కోవడం, బాణసంచా కాల్చడం నిషిద్ధమని, ఎటువంటి బాణసంచాను వినియోగించకుండా చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని వాడచీపురుపల్లి గ్రామ పంచాయితీ శివారు గొల్లపేట గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎంపిపి మానవరపు అప్పల నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా పూజలు నిర్వహించి, అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో వియ్యపు ముత్యాలరావు, వియ్యపు బాబూరావు, వియ్యపు దుర్గా, వియ్యపు అప్పలరాజు, వియ్యపు అప్పుడు, నరసింగరావు, తాతారావు, బొట్ట దేముడు, కారుకొండ నరేష్, పాతరపల్లి రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న చోడవరం ఎమ్మెల్యే రాజు

కోటేశ్వరరావు, దొంకిన అప్పలనాయుడు, శనివాడ శ్రీను, స్థానిక నాయకులు వియ్యపు రామారావు, శ్రీను, బర్నికాన నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

బుచ్చయ్యపేట : మండలంలోని నేతవానిపాలెం గ్రామంలో బుధవారం జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, బుచ్చయ్యపేట సర్పంచ్ సుంకర లక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు గోకవాడ

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

కె.కోటపాడు : మండలంలోని కె.కోటపాడు, గొల్లలపాలెం గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి నవరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులుగా శ్రీకృష్ణుని ఆలయాల వద్ద అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముగింపు రోజు ఉదయం నుండే విశేష పూజలు నిర్వహించి గ్రామస్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం తీన్మార్ డబ్బులు, మహిళల చిరుతలు, బల్ల వేషాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు.

దేవరాపల్లి అభివృద్ధికి రూ.90 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మేజర్ పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులకు ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.90 లక్షలు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంజూరు చేసినట్లు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సిసి రోడ్ల నిర్మాణానికి రూ.40 లక్షలు, డ్రైనేజీలకు రూ.35.50 లక్షలు, మెయిన్, దళితుల స్మశాన వాటికలకు మిగతా నిధులు ఖర్చు చేస్తామని చెప్పారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పనులు చేపడతామన్నారు. ప్రస్తుతం పార్కు నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా పనులు జరుగుతున్నాయని, ట్రయల్ రన్ పనులు పూర్తికాగానే యధావిధిగా రోడ్డను పూడ్చే పనులు చేపడతామని చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, వార్డు మెంబర్లు బంధం అప్పలరాజు, దీవి శంకర్, కొల్లి ఈశ్వరరావు, గవిరెడ్డి దేవుళ్ళు, తామరపల్లి సన్యాసిరావు, సిమ్మ అప్పన్న, టిడిపి నాయకులు గుల్లిపల్లి అర్జునరావు, వారాది దేవుళ్ళు, అల్లు అబద్ధం, బండారు అప్పలనాయుడు, సబ్బవరపు మాలిబాబు, సబ్బవరపు శివశంకర్, కొల్లి బాలకృష్ణ పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని ర్యాలీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మట్టి గణపతి విగ్రహాలనే పూజించి పర్యావరణాన్ని కాపాడుదామంటూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. కె.కోటపాడు జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల ముందుండాలన్నారు. వినాయక చవితి ఉత్సవాలలో ప్రతి గ్రామంలో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 డివిడి ప్రసాద్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్వీ పద్మావతి, బోకం ఎర్రి నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎపి రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలు మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మరాజుపేట, నరేంద్రపురం గ్రామాలలో బుధవారం హెచ్‌ఐవిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎం.సరస్వతి, ఎస్ శివ బాబు నాయుడు, వైద్య సిబ్బంది దివ్య, అంగన్వాడీ కార్యకర్త బి జయలక్ష్మి, వెంకటలక్ష్మి, వై గోవిందా, కె జోగినాయుడు, కర్రి భద్రాజులు, తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది : చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో బుధవారం బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెంలో 'మీకు తెలుసా' కార్యక్రమం నిర్వహించారు. లింక్ వర్కర్ స్కీమ్ సిఎల్‌డబ్ల్యూ ఉద్దిప మాట్లాడుతూ హెచ్‌ఐవి, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల్లో అవగాహన కలిగించి తద్వారా ఎక్కువ మంది హెచ్‌ఐవి పరీక్షలు చేసుకునేందుకు ముందుకొచ్చేలా ఈ అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి రూప, సిఎల్‌డబ్ల్యు సూర్య కళ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి -అనకాపల్లి : పౌష్టికాహారంతోనే తల్లులకు ఆరోగ్యం లభిస్తుందని అనకాపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఏసీడీపీఓ టి.శశికళ అన్నారు. సెప్టెంబరు 1 నుండి నెలాఖరు వరకు నిర్వహించే పౌష్టికాహార మాహాత్యంలో భాగంగా బుధవారం తల్లులకు పౌష్టికాహారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం లోపమే అనారోగ్య సమస్యలకు రక్తహీనతకు కారణమన్నారు. పిల్లల బరువు ఎత్తులు కొలిచి పిల్లల పోషణ స్థితిపై తల్లులకు అవగాహన కల్పించారు. అక్కిరెడ్డి పాలెం - 1అంగన్వాడి కేంద్రంతో - తల్లులకు పోష్టి కాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం బాలింత గృహ సందర్శనలు, తల్లులు బిడ్డలకు పౌష్టికాహారం, తల్లిపాలు పట్టే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ పర్యవేక్షకురాలు, అంగన్వాడి కార్యకర్త, పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసిన ఈశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల మేజర్ పంచాయతీ క్లర్క్‌గా పొలమరుశెట్టి ఈశ్వరరావు నిబద్ధతతో పనిచేసి మంచి వ్యక్తిగా పేరు సంపాదించారని తుమ్మపాల గ్రామ పెద్దలు కొనియాడారు. ఈశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం తుమ్మపాల వెంకటేశ్వర కళ్యాణమండపంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, మాజీ సర్పంచ్ కర్రి వెంకట సన్యాసినాయుడు, విశ్వేశ్వరరావు, బలరాం, ఆడారి గోవిందరావు, బోసు బాబు, బొడ్డపాటి రాజారావు, మత్తుర్తి మహేష్, రాపేటి రామ్ కుమార్, బొడ్డపాటి వెంకట సూరి, పీలా తాతు నాయుడు, బొడ్డపాటి సత్యనారాయణ, ఆర్టీసీ సత్యనారాయణ, వియ్యపు సింహాచలం, కొణతాల రమణబాబు, ఎంపీటీసీ సభ్యురాలు పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వార్డు సభ్యులు రవ్వ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శిబిరానికి హాజరైన సిబ్బంది

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండలో గల కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినీలకు వైద్యాధికారి శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మిని, పిహెచ్‌సి డాక్టర్ కీర్తి, ఎంఎల్‌హెచ్‌పిసి, హెచ్‌వి అరుణకుమారి, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పాల ప్యాకెట్లు అందజేస్తున్న టీం సభ్యులు

వరద బాధితులకు సహాయం

ప్రజాశక్తి- నక్కపల్లి:విజయవాడలో వరద బాధితులకు పాయకరావుపేట ఐటీడీపీ టీం అండగా నిలిచారు. అనకాపల్లి జిల్లా ఐటిడిపి అధ్యక్షులు భీమరశెట్టి శ్రీనివాస్, పాయకరావుపేట నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు మల్లిపెద్ది సతీష్, నక్కపల్లి మండలం అధ్యక్షులు గంట్యాడ రమేష్, దువ్వు శ్రీనివాస్ యాదవ్, బలం నాగేశ్వరరావు తదితరులు బుధవారం వరద బాధితులకు భోజనం ప్యాకెట్లు, పాలు, బిస్కెట్లు, వాటర్ బాటిల్స్‌ను అందించి తమ ఉదారతను చాటుకున్నారు.

ఏలేరు కాలువ ఉధృతిపై దండోరా

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో ఎండ పల్లి గ్రామం మధ్య నుంచి విశాఖకు వెళుతున్న ఏలేరు కాలువ గడిచిన రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ మేరకు గ్రామంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు గ్రామ కార్యదర్శి, ఇంచార్జ్ ఈఓపిఆర్డి నరసింహరావు గ్రామంలో దండోరా వేయించారు. ఏ క్షణమైనా ఎగువ నుంచి నీరు విడుదల చేసే అవకాశం ఉన్నందున పరిసర ప్రాంత గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల సిహెచ్‌సిలో రోగులను మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం నాయకులు కోరారు. సిహెచ్‌సి మరమ్మతు పనులు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి డిమాండ్ చేసారు. బుధవారం మాడుగుల కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా ఉందని, జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందన్నారు.మాడుగుల కమ్యూనిటి హెల్త్ సెంటర్ పరిస్థితి అద్వాన్నంగా ఉందన్నారు, వర్షం వస్తే ల్యాబ్ టెక్నిషన్ రూమ్ స్లాబ్ పెచ్చులు రాలుతుందని, పూర్తిగా తడిసి ముద్ద అవుతుందని తెలిపారు. గతంలో కొంత మేరకు రీపెరింగ్ చేసినా ప్రయోజనం లేదన్నారు. కొత్త భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచి పోవడంతో రోగులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. నూతన ప్రభుత్వం పై ప్రజలు ఎంతో ఆశలు పెట్టుకుని ఓట్లు వేసారని, వాటిని నెరవేర్చాలని కోరారు.



వైద్య సేవలపై ఆరా తీస్తున్న నరసింహమూర్తి

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగు పర్చాలని, జ్వరాలను అదుపులోకి తీసుకురావాలన్నారు. సరిపడా మందులు అందించాలని, రోగులకు సౌకర్యాలు మెరుగు పర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కె భవానీ, పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ



మందులు వేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కేసి గుప్తా పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఆయుష్మాన్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్వైన్ ఫ్లూ, వైరల్ జ్వరాలు సోకకుండా హోమియోపతి మందులను స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు వెలగ నారాయణరావు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగంతో ఎటువంటి ప్రభావం చూపుతుందో వివరించారు. మత్తుపదార్థాలు వినియోగించడంతో కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయన్నారు. ఉన్నత చదువులు చదివి జీవితంలో అనుకున్నది సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లక్ష్మణ్, జోన్ చైర్మన్ కుసుమంచి కృష్ణ, క్లబ్ సభ్యులు దేవత అరుణ, హోమియోపతి డాక్టర్ రమణారావు, వార్డెన్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

నర్సీపట్నం టౌన్: శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మనవడు శివన్ పాత్రుడు పుట్టిన రోజు సందర్భంగా ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు (బుజ్జి మీసేవ), డాక్టర్ రావు హోమియోపతి ఆధ్వర్యంలో ఫ్లూ , వైరల్ జ్వరాలకు ఉచిత హోమియోపతి చుక్కల మందు పంపిణీ బుధవారం నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ వార్డ్ సభ్యుడు ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుపై గ్రామసభ

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో తంగేడు పంచాయితీకి సంబంధించి ఎమ్మెట్ గ్రామమైన పాతతంగేడు గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు



గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

కలెక్టర్‌కు పెట్టుకున్న వినతి మేరకు బుధవారం పాత తంగేడు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు.గ్రామ సర్పంచ్ శివప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి సంతోషి అధ్యక్షతన అధికారులు, నాయకులు ప్రజాభిప్రాయం సేకరించారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ, తంగేడు పంచాయతీ సచివాలయ కార్యాలయానికి వెళ్లేందుకు సుమారు రెండు కిలోమీటర్లు కావడంతో సరైన రవాణా సౌకర్యం లేక పోవడంతో వృద్ధులు వికలాంగులు, మహిళలు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.తక్షణమే పంచాయతీగా ఏర్పాటు చేయాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తంగేడు గ్రామానికి వెళ్లి ఓటు వేసేందుకు అవస్థలు పడుతున్నామని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తంగేడు, పాత తంగేడు గ్రామాలకు సంబంధించిన ప్రజలు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలి

కొత్తకోట సిఐ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కొత్తకోట:వినాయక చవితిని పురస్కరించు కొని గ్రామాలలో మండపాలు ఏర్పాటుకు అనుమతుల కోసం సింగిల్ విండో విధానం అమలు చేసినట్లు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం కొత్తకోట సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, గతంలో అగ్నిమాపక, విద్యుత్, పోలీస్ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉండేదన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది సింగిల్ విండో విధానం అమలకు చర్యలు చేపట్టిందన్నారు. అనుమతి కావాల్సిన వారు 7995095800కు వాట్సాప్‌లో హాయ్ అని మెస్సేజ్ చేస్తే అనుసరించాల్సిన ప్రక్రియ ఫోన్ కు వస్తుందని సిఐ వివరించారు.సర్కిల్ పరిధిలో రోలుగుంట, రావికమతం, కొత్తకోట, బుచ్చెయ్యపేట ఎస్సైలకు వీటిపై అవగాహన కల్పించామన్నారు. అనుమతులు లేకుండా మండపాలు నిర్మిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎస్సై లక్ష్మణరావు పాల్గొన్నారు.



అనుమతులు తప్పనిసరి

గొలుగొండ:వినాయక చవితికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని గొలుగొండ ఎస్సై పి.రామారావు సూచించారు. వినాయక చవితి మండపం ఏర్పాటు చేసే ప్రజల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎటువంటి గొడవలు జరగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు.



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్

జోగంపేటలో పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జోగుంపేట పంచాయతీలో సర్పంచ్ జువ్వల లక్ష్మీ ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైనేజీల్లో పేరుకు పోయిన పూడికలను తొలగించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ చిట్ల అప్పారావు, పంచాయతీ సెక్రటరీ రఘురాం పాల్గొన్నారు.

అయ్యన్న జన్మదినం సందర్భంగా..

పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-గొలుగొండ:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జన్మదిన వేడుకలను బుధవారం కేడిపేటలో ఘనంగా జరిగాయి. కేడిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కేన్సర్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మాజీ జెడ్పిటీసీ చిటికెల తారకవేణుగోపాల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు బొడ్డు జమీలు, ఎంపిటిసి రుత్తల రామకృష్ణ, చిట్టిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్:స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పుట్టినరోజు సందర్భంగా నర్సీపట్నం మున్సిపాలిటీ టీడీపీ నాయకులు బుధవారం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్, పండ్లు, జ్యూస్ అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే వేడుకలను వరదల కారణంగా ఈ సంవత్సరం నిర్వహించడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర రాజు, వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్, లాలం మురళీ, రావాడ నాయుడు, పైల గోవింద, జాలమూరి రాజకుమార్, కూడకల శ్రీకాంత్, మార్కెట్ రాజా, డాబాల శ్రీను పాల్గొన్నారు.

మొక్కలు నాటిన టిడిపి నేతలు

మున్సిపాలిటీ బలిఘట్టం ఉత్తరవాహిని వద్ద ఉన్న శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి దేవాలయం సమీపంలో స్పీకర్ అయ్యన్న జన్మదినం పురస్కరించుకొని టిడిపి ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ ఆధ్వర్యంలో 68 మొక్కలను నాటారు. ముందుగా సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ స్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త శెట్టి మోహన్, కౌన్సిలర్ రామరాజు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఆలయ ఈఓ దివ్య పాల్గొన్నారు.

నర్సీపట్నం బీసీ కాలనీలో బాలసదనం విద్యార్థినులకు నూతన రెడీమేడ్ బట్టలు, స్వీట్స్‌ను అయ్యన్నపాత్రుడు చిన్న కోడలు చింతకాయల దివ్య రాజేష్, కుటుంబ



రోగికి పండ్లు ఇస్తున్న నాయకులు

సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాబాల శ్రీను, రుత్తల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న నెల వేతనం విరాళం

నర్సీపట్నంటౌన్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రతీ ఏటా సెప్టెంబర్ 4న తమ పుట్టిన రోజును నర్సీపట్నంలో జరుపుకునేవారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత విపత్తులను దృష్టిలో ఉంచుకుని పుట్టిన రోజు వేడుకలను రద్దు చేసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి ఒక నెల జీతం మొత్తాన్ని విరాళంగా ప్రకటించారు.



ఎస్ఐకు పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న నాయకులు

ఎస్ఐని కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రామారావును బుధవారం మండలంలోని వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ సుర్ల వెంకట గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ ప్రెసిడెంట్ లెక్కల సత్యనారాయణ, యూత్ ప్రెసిడెంట్ రామకృష్ణ నాయుడు, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరిగిన ధరలపై ధర్నా

ప్రజాశక్తి-గొలుగొండ: పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సిపిఐ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, ఏఐటియుసి నాయకులు ఎల్వి.రమణ, సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, సహాయ కార్యదర్శి జి.రాధాకృష్ణ, కిల్లాడ అప్పలనాయుడు, గిరిజన సమాఖ్య నాయకులు దొర, తురంగల చిన్న పాల్గొన్నారు.

చెక్కపై అక్షరమాల అద్భుతం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, కార్పెంటర్ దార్ల రవి తన సూక్ష్మకళతో గురువులకు వందనాలు తెలియజేశాడు. గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా తన సూక్ష్మకళతో చెక్కతో పెన్, పుస్తకంతో పాటు టీచర్స్ అక్షరమాలను అద్భుతంగా తీర్చిదిద్దాడు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేశాడు.



చెక్కపై అక్షరాలు


అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త, వైద్య సిబ్బంది

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి- వడ్డాది : సెప్టెంబర్ ఒకటి నుంచి 35వ తేదీ వరకూ నిర్వహించే పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుచ్చయ్యపేట మండలం మంగళాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం ఉపయోగాలపై అంగన్‌వాడీ కార్యకర్త రాధాలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ పోషక పదార్థాలు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు వచ్చే ఆహారాలు తయారు చేసి తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంటే పద్మరేఖ, ఎఎన్ఎం రమణమ్మ, ఎంఎల్ హెచ్ పి రేవతి, మహిళా పోలీస్ మహాలక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో సమస్యలు తెలపాలి

-గిరిజన సంక్షేమ జిల్లా అధికారిణి నాగ శిరీష

ప్రజాశక్తి -కొత్తకోట: ఆదివాసి గిరిజన గ్రామాలలో సామాజిక, వ్యక్తిగత సమస్యలు తెలియజేయాలని అనకాపల్లి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి నాగ శిరీష కోరారు. బుధవారం రావికమతం మండలంలోని చీమలపాడు ఆదివాసి గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రధాన మంత్రి జన్ మన్ కార్యక్రమంలో భాగంగా ఆదివాసి గ్రామాలలో విద్య, వైద్యం, రహదారి, పాఠశాలలు, విద్యుత్, రవాణా తదితర సామాజిక సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలైన ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, పట్టాదారు పాసుపుస్తకాలు తదితర సమస్యలపై దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే ఈ గ్రామాల సామాజిక సమస్యలపై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు నివేదిక ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. ఈ నివేదికలో పొందుపరచని సమస్యలపైన గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంజరి రాజు, ఉప సర్పంచ్ గోరా సంజీవి, ఏపీ ఆది వాసి గిరిజన హక్కుల సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణం, ఎంపిటిసి చిన్నమ్ములు పాల్గొన్నారు.


బోచర్ విడుదల చేస్తున్న నాగశిరీష

ఆస్తిపన్ను తగ్గింపు, రద్దు అంశాలను అజెండాలో చేర్చాలి

సిపిఎం జిల్లా కమిటీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఆస్తిపన్ను తగ్గింపు, విలువ ఆధారిత ఆస్తి పన్ను రద్దు, చెత్తపై యూజర్ చార్జీల రద్దును జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో అజెండాలుగా పెట్టాలని కోరుతూ సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ బుధవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారికి వినతి పత్రాన్ని అందించారు. ఈ నెల 10వ తేదీన జరగనున్న జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో ప్రస్తుత నివాస భవనాల ఆస్తిపన్ను పరిధిని 0.13 శాతం నుంచి 0.10 శాతానికి, నివాసేతర భవనాలకు 0.30 శాతం నుంచి 0.20 శాతానికి తగ్గింపును, చెత్తపై యూజర్ చార్జీలను పూర్తిగా రద్దుకు కౌన్సిల్ అజెండాలో పెట్టి తీర్మానం చేయాలని కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న విలువ ఆధారిత ఆస్తిపన్నును తగ్గించడానికి జివిఎంసికి అధికారం ఉన్న నేపథ్యంలో కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరారు. తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. విలువ ఆధారిత పన్ను పద్ధతి ప్రజలకు తీవ్ర భారంగా ఉందన్నారు. ఏటా 15 శాతం పెంపుదల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వివరించారు.

రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం నాయకత్వంలోని జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఆస్తి పన్ను తగ్గిస్తామని, సమీక్షిస్తామని, చెత్తపై యూజర్ ఛార్జీలు పూర్తిగా రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు వాగ్దానం చేసిన నేపథ్యంలో తాము ప్రతిపాదించిన ప్రతిపాదనలకు కౌన్సిల్లో కూటమి కార్పొరేటర్లు మద్దతు ఇస్తారని భావిస్తున్నామని, వైసిపికి కార్పొరేటర్లు కూడా ఈ ప్రతిపాదనలను బలపరుస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. సిపిఐ కార్పొరేటర్ ఈ ప్రతిపాదనలను బలపరుస్తున్నారని తెలిపారు.


మేయర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న గంగారావు

అనుమతి లేకుండా హాస్టల్ నడపొద్దు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు కొండ వెనుక పాలెంలో ఉన్న లవ్ ఇన్ యాక్షన్ చిల్డ్రన్స్ హోమ్‌ను అనుమతి లేకుండా నడపొద్దని షెల్టర్ హోమ్ వెరిఫికేషన్ కమిటీ అధికారులు నిర్వాహకుడుకు సూచించారు. బుధవారం కమిటీ అధికారులు లక్ష్మి, శరత్, ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత హాస్టల్ సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. హాస్టల్ నిర్వహణకు అనుమతులు లేనందున నిర్వహించరాదని హాస్టల్ నిర్వాహకుడికి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు, కమిటీ అధికారులు, స్థానిక అధికారులు కలిసి సమావేశం అయ్యారు. శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులను రప్పించి, వారితో మాట్లాడి వారి ఇష్టం మేరకు స్థానిక ప్రభుత్వ హాస్టల్లో చేర్పించి కొనసాగించాలని ,లేని పక్షంలో వారి సొంత గ్రామాల్లో హాస్టల్లో ఉంటూ స్కూల్లో చదివే విధంగా చర్యలు చేపట్టాలని స్థానిక ఐసిడిఎస్ ఉద్యోగులకు, సోషల్ వెల్ఫేర్ ఉద్యోగులకు సూచించారు .

కేరళ వరద బాధితులకు ప్రజాశక్తి రూ.41 వేలు విరాళం

ప్రజాశక్తి - విశాఖపట్నం : కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ రూ.41,326 విరాళం అందజేసింది. ఈ విరాళ మొత్తాన్ని ప్రజాశక్తి ఉద్యోగులు, కార్యాలయ సమీప ప్రాంతాల్లోని ప్రజలు అందించారు. సేకరించిన విరాళ మొత్తాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుకు ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన అందజేశారు. కార్యక్రమంలో పత్రిక జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మధుసూదనరావు, ఎస్.రాజేశ్వరరెడ్డి, సిబ్బంది సంతోష్, డి.రాజేష్, దేవుడుబాబు పాల్గొన్నారు.


విరాళాన్ని అందజేస్తున్న ప్రజాశక్తి జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఉద్యోగులు

కెజిహెచ్ సెక్యూరిటీ గార్డులకు రూ.26 వేలు ఇవ్వాలి

ఆర్‌కెఎస్‌వి కుమార్ డిమాండ్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, బకాయి ఉన్న మూడు నెలల జీతాలను చెల్లించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ డిమాండ్ చేశారు. కెజిహెచ్ సెక్యూరిటీ గార్డుల జనరల్ బాడీ సమావేశం ఎం.సూకరత్నం అధ్యక్షతన సిఐటియు జగదాంబ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం, పర్మినెంట్ స్వభావం ఉన్న ఉద్యోగస్తులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ వర్కర్లకు కాంట్రాక్టర్ నెల, నెలా జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్ళు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు మాట్లాడుతూ, జిఒ 43 ప్రకారం పెరిగిన డిఎతో కలిపి ప్రస్తుతం రూ.14,500 జీతం ఇవ్వాలన్నారు. కానీ పిఎఫ్, ఈఎస్ఐ రెండు పక్కల వర్కర్ నుంచి రికవరీ చేసి కేవలం రూ.9090 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ప్రిన్సిపల్ ఎంప్లాయ్‌గా కెజిహెచ్ సూపరింటెండెంట్ జిఒ ప్రకారం జీతాలు ఇప్పించాలని కోరారు. పిఎఫ్, ఈఎస్ఐ మొత్తం జీతం మీద కాకుండా తక్కువ జీతానికి కడుతూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. 2024 జూన్, జులై, ఆగస్టు నెల జీతాలు తక్షణం కాంట్రాక్టర్ ఇవ్వాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం. సుబ్బారావు మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డులు ఐక్యంగా ఉండి పోరాటం ద్వారా సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. సూకరత్నం, సంధ్యారాణి, శంకర్, శ్రీదేవి, విజయలక్ష్మి, కెజిహెచ్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి కుమార్

జిల్లా ఉత్తమ టీచర్‌గా సత్యనారాయణ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చోడిశెట్టి సత్యనారాయణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈఓ కే.నరేష్ వెల్లడించారు. బుధవారం ఎంఈఓ నరేష్ మాట్లాడుతూ, సత్యనారాయణ అంకితభావంతో విధులు నిర్వహిస్తారన్నారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించడంలో ఆయన కృషి అభినందనీయం అన్నారు. గ్రామ సర్పంచ్ ఫాతిమున్నీషా బేగం ,తెలుగు ఉపాధ్యాయులు ఎన్ వి ఎస్ ఆచార్యులు మాట్లాడుతూ ,గత రెండేళ్లగా 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు తీసుకుని రావడంలో హెచ్ఎం సత్యనారాయణ ఎనలేని కృషి చేశారన్నారు. ఉపాధ్యాయులు ఫల్గుణరావు, కుమారి, చిన్నారావు, రమేష్ బాబు, శ్రీదేవి ఆయనను అభినందించారు.



పాత పెన్షన్ విధానం అమలుకు ఉద్యమం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పాత పెన్షన్ స్కీం కొనసాగించే విధంగా మరింత బలంగా కార్మిక ఉద్యమాలు నిర్మిస్తామని ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ నాయకులు కుమార్ తెలిపారు. ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎఐడిఈఎఫ్ జాతీయ నాయకులు కుమార్, రాజీవ్ కుమార్ పరాశర్ హాజరై మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కేంద్ర ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ, ఆ స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీం తీసుకొచ్చిందని, ఇది పూర్తిగా కేంద్ర ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉందని తెలిపారు. దీనిపై పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా ఉద్యమాలు జరిగినప్పటికీ మోడీ ప్రభుత్వం చలనం లేకుండా ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. రక్షణ పౌర ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎఐడిఈఎఫ్ నిరంతరం ఉద్యమిస్తోందని తెలిపారు. ఓటిపై హెచ్ఆర్, 18 నెలల డిఎ/డిఆర్, 8వ వేతన సంఘం వెంటనే ఏర్పాటు జరిగే విధంగా ప్రయత్నాలు చేపట్టాలని, డైలీ వేజ్ ఉద్యోగులకు క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్.స్టీల్, డిజిఎన్ పి, డాక్ యార్డ్, ఎంఐవి ఉద్యోగులు, కార్మిక నేతలు, ఈఎన్ఈ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సబ్బం కిరణ్ కుమార్, అధ్యక్షుడు ఉడతా అప్పల రాజు, ఉపాధ్యక్షుడు మన్యాల ప్రసాద్‌బాబు, డిజిఎన్‌పి యూనియన్ నాయకులు ప్రేమానంద్, ఎన్ఎడి సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కృష్ణంరాజు, ఎన్ఎస్ స్టీల్ యూనియన్ వర్మ, జి.వెంకటేష్, మేఘన మాలిక్, పడాల నాగేంద్ర, కాళ్ల బనాయ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కుమార్

మట్టి వినాయక విగ్రహాలతో మేలు

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగుల మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు దంపతులకు మట్టి వినాయక ప్రతిమలను భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు వారి నివాసం తారువ లో బుధవారం అందించారు. ఈ సందర్భంగా ప్రజలు అందరూ మట్టి వినాయకుని పూజించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.


మట్టి విగ్రహాలు ఇస్తున్న సభ్యులు